మినీకథ

# ట్రీట్‌మెంట్

మంత్రవాది మహేశ్వర్




అబిడ్స్‌లో ఆర్టీసి బస్సెక్కాను. (ఇలా చెప్పుకోవడం నాకెంతో గర్వంగా వుంది) లోపలి కెళ్ళిన కాసేపటికిగానీ కుమార్‌ని చూడనేలేదు. కుమార్ ఎవరో కాదు నా బెస్ట్ ఫ్రెండ్. అద్దెలు పెరుగుతున్నకొద్దీ ఆఫీసుకు దూరమవుతున్న అభాగ్యుడు. పాపం ఈ మధ్యనే పెళ్ళికూడా అయింది. బాగా ఆస్తున్న పిన్ని పెంచి పెద్ద వాడ్ని చేసింది. కానీ లక్కేమిటంటే ఆ పిన్ని మంచంపట్టి ఈవేళో, రేపో అన్నట్టుగా వుంది. స్వర్గానికి, నరకానికీ మధ్య వుండిపోయిన బాబయ్య పిన్నిగారి కంపెనీ కోసం ఎదురు చూస్తున్నాడు.

కాసేపు ఈమాటలూ ఆమాటలూ అయ్యాయి.

"ఇంట్లో ఆడవాళ్ళని బస్సుల్లో ఎక్కడికైనా పంపించాలంటే భయమేస్తోందిరా" అన్నాడు.

"ఏం" అన్నాను ఆశ్చర్యంగా.

"అలా అంటావేమిటి మొన్న (నిజంగా మొన్నే కాదులెండి) చార్మినార్ బస్సులో ఓ విద్యార్థినిని మానభంగం చేయటానికి ప్రయత్నించటం..." జరిగిన విషయం చెప్పటం ప్రారంభించగానే ప్రక్కన నిలబడ్డవారు ఆ టాపిక్ పైన యింట్రెస్ట్‌ను ప్రకటించారు. ఓ యువకుడు "అసలు పొరపాటు జరిగిపోయింది. చితక్కొట్టేయాల్సింది ఆ వెధవల్ని. ఇంత నీచానికి పాల్పడతారా. ఇప్పుడు ఎవరో అమ్మాయే అయింది. రేపు మన స్వంత చెల్లెలో అక్కయ్యో అయితే వూరుకుంటామా..."

"యస్ కరెక్ట్" నలభై ఏళ్ళ కళ్ళజోడు.

ఆడవాళ్ళు తలలెత్తి చూశారు.

ఇంతలో కండక్టరు నా దగ్గరికి వచ్చాడు... టిక్కెట్టుకోసం అర్థరూపాయిచ్చాను... నలభై పైసల టిక్కెట్టిచ్చి ముందుకెళ్ళిపోయాడు.

"పది పైసలు..." అన్నాడు నాతో కుమార్.

"అది అలవాటే. ఒకవేళ చిల్లర వెనక్కిస్తే వాడు పొరపాటు అనుకుంటాడు."

"మనం ఊరుకోవడంబట్టే వాళ్ళ ఆటలు సాగుతున్నాయి. చదువుకున్నవాళ్ళమై వుండి డిమాండ్ చేయకపోవడం మన తెలివితక్కువ తనమే."

ముందుసీట్లో కూర్చుని 'నో స్మోకింగ్' అని వ్రాసివున్న దానికేసిచూస్తూ సిగరెట్ పొగను రింగులు త్రిప్పుతున్న ఓ యువకిశోరం బుర్ర తిప్పింది...

నాలో ధైర్యం ఒళ్ళు విరుచుకుంది. వాడ్ని చూసి కాదు. కుమార్ మాటలు విన్నాక.

లేడీస్ ముందు హీరో అయిపోవాలనిపించింది. కండక్టర్ అక్కడే వున్నాడు. వాడికి సరియైన ట్రీట్‌మెంట్ యివ్వాలనిపించింది.

"...చూడు కుమార్ నేను పదిపైసలు ఎందుకు వదిలేశానోనని ఆలోచిస్తున్నట్టున్నావు కదూ. చెప్తా విను- నేనెప్పుడైనా ముష్టివాళ్ళొస్తే డబ్బు లేస్తానా. వేయను. ఎందుకు? ఒకటి: సమయానికి జేబులో చిల్లరుండదు. రెండు: అలా వేసి వారి వృత్తిని వృద్ధిచేసి దేశానికి అన్యాయం చేస్తున్నానేమో అనిపిస్తుంది. అందుకే పుణ్యం సంపాదించడానికి యీ బస్సుల్లో పది- అయిదు వదిలేస్తుంటాను" కాస్త గట్టిగానే అన్నాను. అర్థమైన వాళ్ళు నవ్వారు. అర్థంకాని వాళ్ళూ వాళ్ళు నవ్వారని నవ్వారు.

కండక్టరు చెవిన పడ్డట్టున్నాయి అన్నవి దగ్గరగా వచ్చి పావలా చేతిలో పెట్టాడు.

పావలా ఎందుకిచ్చాడో కుమార్‌కే కాదు. నాకూ అర్థం కాలేదు.

"పది కదా యివ్వాల్సింది..." లోపలే అనుకున్న నేను బయటికి అనేశాను.

"నిన్న కూడా మీకివ్వాల్సింది యివ్వలేదు సార్. రెండింటిదీ కలిపిస్తున్నాను యిప్పుడు... తీసుకోండి"— ముందుకెళ్ళిపోయాడు.

స్టేజి వస్తున్నా ఆగటం లేదని గ్రహించిన ఎవరో దిగాల్సిన వ్యక్తి తనే బెల్లుకొట్టుకున్నాడు.

*